గాంధీ ఆస్పత్రి వద్ద అన్నదానం



గాంధీఆస్పత్రి : వైఎస్ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా నేతృత్వంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు వెయ్యిమంది నిరుపేదలు, అన్నార్తులు, రోగి సహాయకులకు అన్నదానం చేసినటు ఆయన వివరించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా నరేష్



సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజరాజేశ్వరినగర్‌కు చెందిన సిర్మణి నరేష్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్–మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. గతంలో బూత్ అధ్యక్షులుగా, రెండుసార్లు డివిజన్ యువమోర్చా డివిజన్ అధ్యక్షులుగా, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సేవలు గుర్తించి పార్టీ డివిజన్ పగ్గాలను అప్పగించారు.

ఇంజినీరింగ్ ఫీజుల పెంపు తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంపు నిర్ణయం తగదని ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ నాయకులు శనివారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు.ఫీజులు పెంచితే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో అధ్యాపకుల వివరాలతో పాటు ఇతర మౌలిక వసతులను వర్సిటీ అధికారులు పరిశీలించాలన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యం

రాంగోపాల్‌పేట్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైంది. గోపాలపురం పోలీసులు తెలిపిన మేరకు.. ఆదిబట్లకు చెందిన వెంకటేశ్వరమ్మ (65)కు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా ఉండదు. ఆదిబట్లలో ఆమె ఒక్కరే నివాసం ఉంటోంది. ఆమెను మరిది కృష్ణారెడ్డి అశోక్‌నగర్‌కు తీసుకెళ్లేందుకు బస్సులో రెతిఫైల్ బస్టాండుకు చేరుకున్నాడు. బస్సులో కూర్చోబెట్టి మెడికల్ షాపునకు వెళ్లి వచ్చే లోపు ఆమె కనిపించ లేదు. దీంతో శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సరస్వతి మాత శేషవస్త్రాల వేలం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో శనివారం సరస్వతి మాత శేష వస్త్రాలు(చీరలు) వేలం వేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున వేలంలో పాల్గొని అమ్మవారి శేష వస్త్రాలను కొనుగోలు చేశారు.ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించి, అనంతరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారిణి(ఈవో) కె. జయంతి, ఆలయ అర్చక స్వామి అప్పారావు, ధర్మకర్తలు మధుసూదన్ సమక్షంలో నిర్వహించారు. వేలం ఆదివారం, సోమవారం కూడా కొనసాగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 43, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్ 27, దొండ 19, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 95, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సైబర్ నేరగాళ్ల

'స్మార్ట్' దోపిడీ



ఆర్థికంగా నష్టపోయి పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతున్న బాధితులు

- సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని విలవిల..
- రోజుకొకరైనా మోసపోయి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైనం
- ఆదమరిస్తే..అంతే సంగతులు..

సనత్‌నగర్: సనత్‌నగర్‌కు చెందిన రోహన్ ఫోన్‌ వాట్సప్‌కు పార్ట్‌టైమ్ జాబ్ అంటూ లింక్ వచ్చింది. దీనికి ఆకర్షితుడైన రోహన్ లింక్ ఓపెన్ చేసి టెలిగ్రామ్‌కు కనెక్ట్ అయ్యాడు. ఆన్‌లైన్‌లో కొంత పనిని అప్పగించగా దానిని పూర్తి చేసిన రోహన్‌కు ఆన్‌లైన్ ద్వారా కొంత డబ్బులను కూడా పంపించారు. ఆ తర్వాత ఎక్కువ లాభం పొందాలంటే కొంత పెట్టుబడి పెట్టాలని సైబర్ మోసగాళ్లు అతన్ని నమ్మించారు. దీంతో వారి మాటలు నమ్మి రూ.1,03,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అంతే..ఇక అవతలి వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయిన రోహన్ పోలీసులను ఆశ్రయించాడు.

- బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన రామారావు తన ఇంట్లో సోనీ టీవీ రిపేర్ సేవల కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. కనిపించిన నెంబర్‌కు ఫోన్ చేశాడు. సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చారు. వివరాలు అడిగిన అవతలి వ్యక్తి రూ.9 పంపమని చెప్పడంతో రామారావు పంపాడు. ఆ వెంటనే రామారావు బ్యాంక్ ఖాతా నుంచి రూ.86 వేలు మాయం అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్ గడప తొక్కాడు.
- సనత్‌నగర్‌కు చెందిన గోస్కోండ హారికకు వచ్చిన సందేశం ఆధారంగా టెలిగ్రామ్‌కు కనెక్ట్ అయ్యింది. పెట్టుబడి పెడితే ఆకర్షణీయమైన లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. దీనికి ఆకర్షితురాలైన ఆమె వారి మాటలు నమ్మి రూ.1,40,000లు బదిలీ చేసింది. ఆ తర్వాత నుంచి వారి నుం చి స్పందన లేదు. మోసపోయానని గ్రహించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఇలా ఒకరు కాదు..ఇద్దరు కాదు..పదుల సంఖ్యలో బాధితులు సైబర్ మోసగాళ్ల బారిన పడి ఆర్థికంగా నష్టపోయి పోలీస్‌స్టేషన్ల గడప తొక్కుతున్నారు. తమ ఫోన్లకు కుప్పలు తెప్పలుగా వచ్చే వివిధ రకాల ఆకర్షణీయమైన ఆఫర్లతో కూడిన సందేశాలకు ముగ్ధులై వాటికి రిప్లై ఇస్తూ చివరకు సైబర్ నేరగాళ్లు వేసిన వలలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. అమాయకుల బలహీనతలనే పెట్టుబడిగా మార్చుకుని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఇబ్బడిముబ్బడిగా లింక్‌లను విసురుతూ తమ వలలో ఎవరైనా పడకపోతారా? అని కాచుకుకూర్చొంటున్నారు. ఈ విషయం తెలియక ఎంతోమంది వారు పంపించే లింక్‌లను ఓపెన్ చేస్తూ తమ బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేయించుకుంటున్నారు.

అధికంగా పార్ట్‌టైం జాబ్ పేరిటనే...

ఇంట్లో ఉండే ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవడం ద్వారా పెద్ద మొత్తంలో లాభాలు పొందవచ్చనే సందేశాలు ఫోన్లకు ఎక్కువగా వస్తున్నాయి. దీనికి నిరుద్యోగులతో పాటు గృహిణులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగత బలహీనతల కారణంగా ఆ సందేశాలు చూసిన వెంటనే ఏమాత్రం ఆలోచన చేయకుండా ఆ లింక్‌లను ఫాలో అవుతున్నారు. ఈ మధ్య కాలంలో ఒక్క సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సైబర్ మోసాలకు సంబంధించిన కేసులు చూస్తే ఎక్కువగా పార్ట్‌టైమ్ జాబ్ ఆశ చూసి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటనలే అధికంగా ఉండడం గమనార్హం. వారంలో నాలుగైదుగురు బాధితులు పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతుండడం కలవరపెడుతోంది.

'స్మార్ట్'గా దోపిడీ...

ప్రస్తుత రోజుల్లో కుటుంబ సభ్యులు కంటే ఎక్కువగా స్మార్ట్ ఫోన్‌లతో గడపడమే ఎక్కువైపోయింది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది కదా..! అని వచ్చిన లింక్‌లన్నీ ఓపెన్ చేసేస్తుండడంతో సైబర్ కేటుగాళ్లు కూడా 'స్మార్ట్'గా దోచేస్తున్నారు. ఇంతకముందు దొంగతనాలు ప్రత్యక్షంగా ఉండేవి. కానీ ప్రస్తుతం టెక్నాలజీ సరికొత్త పుంతలు తొక్కుతున్న పరిస్థితుల్లో నేరగాళ్లు రూటుమార్చి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. చదువుకున్న వారే సైబర్ మోసగాళ్ల బారిన పడడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అంతకంతకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ఒకవైపు పోలీసులు ఎంతగా అవగాహన కలిగిస్తోన్నా సరే మళ్లీ మళ్లీ మోసాలకు గురవుతూనే ఉన్నారు. మోసం చేసేవాడి కంటే మోసానికి గురయ్యేవాడిదే తప్పు అనే రోజులు ఇవి. అలాంటి ఈ రోజుల్లో ఎంత జాగ్రత్తగా ఉండాలో పోలీసులు వివిధ రూపాల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రత్యేకంగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటుచేసి ముఖ్యంగా సైబర్ మోసాలపైనే ఎక్కువగా అవేర్‌నెస్ తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. అయినప్పటికీ పోలీసుల జాగ్రత్తలను పెడచెవిన పెడుతూ ఎంతోమంది సైబర్ నేరగాళ్ల వలలో పడి ఆర్థికంగా భారీగా నష్టపోతున్నారు. విచిత్రమేమిటంటే ఉద్యోగం ఉన్నవాళ్లు కూడా అత్యాశకు పోయి పార్ట్‌టైం చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశ్యంతో లింక్‌లను ఓపెన్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేటతెల్లమవుతోంది. అలాగే తక్కువ ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చనే అత్యాశను సైబర్ నేరగాళ్లు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు.

అపరిచిత లింక్‌లు ఓపెన్ చేయవద్దు



ఈ మధ్య కాలంలో సైబర్ మోసాలు మరీ ఎక్కువయ్యాయి. కేవలం అవగాహనతోనే వీటిని అరికట్టగలం. స్మార్ట్ ఫోన్లకు వచ్చే లింక్‌లను అన్నీ ఓపెన్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో పడకుండా ఉండాలంటే వాటిని వెంటనే డిలీట్ చేయడం ఉత్తమం. ఎక్కువగా పార్ట్‌టైమ్ జాబ్ పేరిట, ఇన్వెస్ట్ పేరిట లాభాలు పొందవచ్చనే లింక్‌ల బారిన పడి మోసపోతున్నారు.

– శ్రీనివాసులు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్

ఓయూలో సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ వీసీ ప్రొ.గోపి.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ధర్మనిధిపై సదస్సు జరిగింది. శనివారం ఓయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సెమినార హాలులో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా మాజీ వీసీ ప్రొ.గోపి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వీరబ్రహ్మేంద్ర స్వామి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొ.గౌరీశంకర్, ప్రొ.వెంకట రాజయ్య, అడ్లూరి రవీంద్రచారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బీజేపీ నేతల బైక్ ర్యాలీ



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్ల మీదుగా బీజేపీ నాయకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరంగా ర్యాలీలో పాల్గొనేందుకు సికింద్రాబాద్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ నాయకులు కనకట్ల హరి, నరేశ్, కీర్తి, అంబాల రాజేశ్వర్‌రావు, గణేశ్ అరవింద్ నేతృత్వంలో పలువురు బీజేపీ ప్రతినిధులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి.....జీవై కంపౌండ్ బస్తీ అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. బస్తీ ప్రజల సూచన మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఖాళీగా ఉన్న ప్లాట్లను స్థానికులకే అందజేస్తామన్నారు. మంచినీటి సరఫరా మెరుగుతో పాటు లిఫ్టులు పని చేసే విధంగా చూడాలని అధికారులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. బస్తీలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తామన్నారు. చిన్నారులు తాము ఆడుకోడానికి వీలుగా క్రికెట్ కిట్ ఇప్పించాలని అభ్యర్థించగా వెంటనే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్రికెట్ కిట్టును తెప్పించి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, జీవై కంపౌండ్ బస్తీ అధ్యక్షులు వెంకటబాబు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మెనిఫెస్టోలో రూపొందించిన సంక్షేమ పథకాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి తీరాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 255 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సీతాఫల్‌మండి అంబేద్కర్ కూడలిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను గుర్తించి షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ వంటి వివిధ పథకాలను ప్రవేశ పెట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలోని వ్యక్తి ప్రభుత్వం వద్ద నిధులు లేవని పదే పదే పేర్కొనడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. మారేడుపల్లి, ముషీరాబాద్ తహసీల్దార్లు భీమయ్య గౌడ్, ప్రతాప్ సింగ్, కార్పొరేటర్లు సామల హేమ, సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శభాష్ ధైవిక్..

పదేళ్ల బాలుడికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

లాలాపేట : ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే విభిన్నమైన సాహిత్య శైలితో పుస్తకాలు రాసిన పదేళ్ల మాస్టర్ నందన ధైవిక్ సాహిత్య ప్రతిభ చాటాడు. వెంకట సత్య ఆదిత్య, సౌజన్యల కుమారుడు ధైవిక్ హైదరాబాద్‌లోని మంతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మిస్టరీ ఆఫ్ ద మిస్సింగ్ జ్యువెల్స్(కథా సాహిత్య శైలి), మై రైమ్స్ మ్యాజిక్(కవిత్వ శైలి) పుస్తకాలు ప్రస్తుతం అమెజాన్, బ్రిబుక్స్ ఆన్‌లైన్‌లో లభ్యం అవుతున్నాయి. అతి చిన్న వయస్సులో అసాధారణ ప్రతిభను చాటుతున్న ధైవిక్‌ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి ప్రత్యేకంగా అభినందిస్తూ తెలుగు బుక్ ఆఫ్ రికారుడ్స గుర్తింపు పత్రాన్ని, సర్టిఫికేట్‌ను అందజేశారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న డా. చింతపట్ల వెంకటాచారి

కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ మైనార్టీ అధ్యక్షుడిగా హఫీజ్

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ మైనార్టీ అధ్యక్షుడిగా ఎండీ హఫీజ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని శనివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం హఫీజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ యాదవ్ పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

కాచిగూడ: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిత ఉన్నతంగా ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాచిగూడలో మాట్లాడుతూ... మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతకు, విద్యార్థులకు పొగాకు నియంత్రణపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసలు కావద్దని ఆయన సూచించారు.

తెలంగాణ జాగృతి కన్వీనర్‌గా మనోజ్‌గౌడ్



ముషీరాబాద్: తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య హైదరాబాద్ కన్వీనర్‌గా రాంనగర్‌కు చెందిన పరకాల మనోజ్‌గౌడ్‌ను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. తెలంగాణ జాగృతి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కవితకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీమాలిక గ్రంథం ఆవిష్కరణ

చిక్కడపల్లి: రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన శ్రీ మాలిక గ్రంథం అపురూపం అని శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి అన్నారు. శ్రీమాలిక గ్రంథం 16వ ముద్రణ త్యాగరాయ గానసభలో శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ పాఠకులు తక్కువగా వున్న నేటికాలంలో ఆధ్యాత్మికగ్రంథం పదహారు ముద్రణలు పొందటం విశేషం అని అన్నారు. గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి, పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్, గీతాదేవిలు పాల్గొన్నారు.

బడీ మసీదును పరిరక్షించాలి



ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో 400ల సంవత్సరాల చరిత్ర కలిగిన చారిత్రాత్మక కట్టడం బడీ మసీదును పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ హాషిమొద్దీన్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నగరంలో చార్మినార్ నిర్మించిన సమయంలో భోలక్‌పూర్‌లో బడీ మసీదును నిర్మించారని తెలిపారు. మసీదు మినార్‌లు పెచ్చులూడి అందకారంగా మారుతున్నదని ఫిర్యాదు చేశారు.

సందడిగా మూలం సంత



వినియోగదారులతో కిటకిటలాడుతున్న మూలం సంత

లాలాపేట: గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తార్నాక మర్రి కృష్ణాహాల్లో నిర్వహించిన 11వ మూలం సంతకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 100 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ, గోఆధారిత, చేతివృత్తుల వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులతో మూలం సంతలో సందడి నెలకొంది. ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ డాక్టర్. పి. వి రావు, దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణులు బసంపల్లి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో సంరక్షణ, ప్రకృతి, పాడి, సాహిత్యం, కుల వృత్తులను, చేతి వృత్తులను ప్రోత్సహించడానికి గ్రామభారతి చేస్తున్న కృషిని అభినందించారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సూచించారు. శనివారం గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో సీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతగా నిలిచిన చత్రపతి శివాజీ బాయ్స్ టీమ్‌కు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుడ్యానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, ఇండియన్ మాజీ క్రికెటర్ వెంకటప్రతాప్ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రం.. రాష్ట్రంలోనే ఆదర్శం

సికింద్రాబాద్ : సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రాని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం ఏపీ మాజీ మంత్రి జోగు రమేష్ నేతృత్వంలోని బృందం సెట్విన్ కేంద్రాన్ని సందర్శించారు. కంప్యూటర్‌తో పాటు వివిధ వృత్తి విద్య కోర్సుల్లో నిరుద్యోగులు, గృహిణులు, విద్యార్థులకు తక్కువ ఫీజుకు శిక్షణ ఇవ్వడం పట్ల జోగు రమేష్ ప్రశంసించారు.సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్, నేతలు పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సెట్విన్ కార్యకలాపాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, ఏపీ మాజీ మంత్రి జోగు రమేష్

రక్తపోటును నిర్లక్ష్యం చేయెద్దు

ముషీరాబాద్: అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయవద్దని సకాలంలో వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలో రక్తపోటుపై అవగాహన శిబిరం, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ రక్తపోటు లక్షణాలు తరుచుగా తలనొప్పిరావడం, చూపు మందగించడం, ముక్కు నుంచి రక్తం కారడం, నీరసంగా ఉంటారని సూచించారు.



యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి